క్లుప్తంగా

ఒకేషనల్ బాలికల కళాశాల ఏర్పాటుకు వినతి

వీపనగండ్ల: కల్వరాళ్లలో బాలికల ఒకేషనల్ కళాశాలను మంజూరు చేయాలని కోరుతూ యువకులు, విద్యార్థులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. బాలికలు ఉన్నత చదువు కోసం సుదూర పట్టణాలకు వెళ్లాల్సి వస్తుందని దీన్ని దృష్టిలో ఉంచుకుని తమ గ్రామానికి కళాశాలను మంజూరు చేయాలని కోరారు. తమ గ్రామంలో కళాశాల ఏర్పాటు అయితే గ్రామానికి అతిచేరువలో ఉన్న వీపనగండ్ల, తూంకుంట, కేతెపల్లి, సంగినేనిపల్లి, బొల్లారం గ్రామాల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. అంతకుముందు మండల కేంద్రంలో విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టర్ ఉద్యోగులు తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి రూ.10 లక్షల బీమాతో పాటు రూ.5లక్షల ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దయాకర్, శ్రీకాంత్, సుధాకర్, కుర్మయ్య, భరత్ చారి, అరవింద్, మహేష్, పృథ్వీ, సీఆర్‌పీ వెంకటేష్, నాగరాజు, గోపాల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక



పాన్‌గల్: మండల కేంద్రం సమీపంలోని బాల పీర్లా దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని వనపర్తి మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం వారు దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్గాను ముస్లింలతో పాటు హిందూవులు పెద్ద సంఖ్యలో దర్గాను దర్శించుకుంటారన్నారు. కార్యక్రమంలో కురుమూర్తియాదవ్, చంద్రయ్యయాదవ్, తిరుమల్‌యాదవ్, కౌన్సిలర్లు కృష్ణ, కంచెరవి, తిరుపతయ్యసాగర్, రాములుయాదవ్, బీరయ్యయాదవ్, కృష్ణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించండి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన కస్తూర్బా బాలికల పాఠశాలకు ప్రహరీ నిర్మించలేదు. గ్రామానికి చివరగా ఈ భవనం ఉండగా, ఇందులో 220 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. ముళ్లగు కాల్వ, మరో వైపు చెరువు ఉండడంతో విషపురుగుల సంచారం ఎక్కువగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించి, లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన కేశపాగ కిష్టమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు రూ 10,600, సర్పంచ్ వినీలా రాణి రూ.5వేలు, కాంగ్రెస్ నాయకులు రూ.5వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందించారు.

ఎట్టకేలకు 'వరుస' మొదలెట్టారు



అడ్డాకుల: మండలం మీదుగా పోతున్న 44వ నంబర్ జాతీయ రహదారిపై ఎట్టకేలకు తెలుపు రంగు వరుసలను ఏర్పాటు చేయిస్తున్నారు. రెండు, మూడు నెలల నుంచి రహదారిపై అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్ మండలాల్లో పాత రోడ్డుపై బీటీ రెన్యూవల్ చేయిస్తున్నారు. భూత్పూర్ మండలం పోతులమడుగు నుంచి శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద కర్నూల్, హైదరాబాద్ రెండు రోడ్లపై బీటీ రెన్యూవల్ పూర్తి చేశారు. పోతులమడుగు నుంచి జడ్చర్ల, టోల్‌ప్లాజా నుంచి కొత్తకోట వరకు బీటీ పనులు చేయించాల్సి ఉంది. అయితే కొత్తగా వేసిన బీటీ రోడ్డుపై తెలుపు రంగు వరుసలు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీనిపై ఈనెల 25న 'రహదారిపై వరుస గుర్తులేవీ' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన రహదారి నిర్వాహకులు రెండు, మూడు రోజులుగా పోతులమడుగు నుంచి టోల్‌ప్లాజా వైపు తెలుపు రంగు వరుసలను ఏర్పాటు చేయిస్తున్నారు. అయితే రహదారిపై డివైడర్ పక్కన మొదట ఒకే లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటే మధ్యలైన్, బాడర్ లైన్‌ను ఏర్పాటు చేయిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టే అవకాశం ఉందని వాహనదారులు అంటున్నారు. రహదారి నిర్వాహకులు ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరముందని చెబుతున్నారు.



ఆత్మకూర్‌లోని ఓ బేకరీలో కేక్‌లు కొనుగోలుచేస్తున్న జనం



అమరచింతలో..

ఉత్సాహంగా సాగిన వేడుకలు

- పట్టణంలో కిక్కిరిసిన బేకరీలు
- రోడ్లపైనా, వీధివీధినా యువకుల కోలాహలం
- మద్యం షాపుల వద్ద మందుబాబుల బారులు



వనపర్తి జిల్లా కేంద్రంలో కేక్ విక్రయాల సందడి



జిల్లా కేంద్రంలో కేక్‌ల కొనుగోలు

వనపర్తి టౌన్/ఆత్మకూరు: గత ఏడాదంతా ఎన్నో ఆటుపోట్లను, విజయాలను చవిచూసిన ప్రజలు 2023 చివరి రోజైనా ఆదివారం డిసెంబర్ 31కి ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణంలో యువకులు, చిన్న, పెద్ద తేడా లేకుండా ఆనందోత్సవాల మధ్య 2023కు గుడ్‌బై చెప్పారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన దుకాణాల ఎదుట, కూడళ్లలో, పలు వీధుల్లోని చౌరస్తాల్లో యువకులు ప్రత్యేకంగా సౌండ్ బాక్సులతో చివరి రోజు గుర్తుండిపోయేలా తమ ఆనందాన్ని కుటుంబం, మిత్రులతో కలిసి పంచుకున్నారు. ఉదయం నుంచే జిల్లా కేంద్రంలో ఏ వీధి చూసిన జన సంచారంతో నిండిపోయింది.

చేయూత ఆశ్రమంలో వీడ్కోలు వేడుకలు

పట్టణంలోని చిట్యాల చేయూత ఆశ్రమంలో సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి తినిపించారు. ఈ మేరకు అధ్యక్షుడు శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ఏదో కారణంతో అనాథలుగా మిగిలిన పిల్లలను అక్కున చేర్చుకొని ఆదరించాల్సిన బాధ్యత సమాజం పై ఉందని, వారి జీవితాల్లో వెలుగులు నింపాల్సిన బాధ్యత సైతం మనపైనే ఉందన్నారు.

ఆత్మకూరు పట్టణంలో..

ఆత్మకూరు పట్టణంలోని బేకరీల్లో కేక్‌లను కొనుగోలు ముమ్మరంగా చేపట్టారు. స్థానిక మిఠాయి, వస్త్ర, బంగారు దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. కొత్త సంవత్సరం తమకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉండాలని పలువురు కోరుకుంటున్నారు.

పోలీసుల ఆంక్షలు..

యువత తప్పతాగి రోడ్లపై హంగామ చేయకుండా పోలీసులు పలు ఆంక్షలు విధించారు. నిబంధనలు అతిక్రమించే వారిని ఉపేక్షించేది లేదని సీఐ రత్నం, ఎస్‌ఐ నరేందర్ స్పష్టం చేశారు. మూడు ప్రత్యేక వాహనాల్లో గస్తీ ముమ్మరం చేసి, అడుగడుగున డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. ఆత్మకూరు పట్టణంలోని మద్యం దుకాణాల మందుబాబులు బారులు తీరారు. వారంరోజుల్లో అమ్ముడుపోవాల్సిన మద్యం ఆదివారం ఒక్కరోజే విక్రయించినట్లు మద్యం వ్యాపారులు తెలిపారు.



ఆత్మకూర్‌లో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



ఆత్మకూర్‌లో ఘుమఘుమలాడే తందూరి చికెన్



ఆత్మకూర్‌లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆగిన కేఎల్ఐ నీటి విడుదల

- తగ్గనున్న వరిసాగు
- గతేడాది 14,500 ఎకరాల్లో సాగు చేయగా
- ఈసారి కేవలం 6,800 ఎకరాలు
- సన్నరకాల సాగుకు రైతుల ఆసక్తి



పర్వతాపురం శివారులో వరి నాటేందుకు కరిగెట చేసిన రైతు

ఖిల్లాఘనపురం: మండలానికి ఖిల్లాఘనపురం బ్రాంచ్‌కెనాల్, కమాలోద్దీన్‌పూర్ బ్రాంచ్ కెనాల్ ద్వారా కేఎల్ఐ సాగు నీరు వస్తుంది. కాల్వల ద్వారా చెరువులకు అందించడంతో పాటుగా మండలంలో చాలా గ్రామాలను కలుపుతూ పారే పెద్ద వాగు ద్వార నీళ్లు రావడంతో మండలంలోని చాలా గ్రామాల్లో పెద్ద ఎత్తున వరిసాగు పెరిగింది. ఈ సంవత్సరం సాగునీటిని నిలిపివేయడంతో ఒక్కసారిగా తగ్గనుంది. కేవలం బోరుబావుల కింద మాత్రమే వరి పంటలను సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

తగ్గనున్న వరి సాగు..

గతేడాది కేఎల్ఐ నీరు ఏప్రిల్ నెల వరకు వదలడంతో మండలంలో 14,500 ఎకరాల్లో యాసంగి పంటగా రైతులు వరిని సాగు చేశారు. ఈ సంవత్సరం నవంబర్ చివరిలోనే నిలిపివేయడంతో యాసంగి పంటగా వరిని సాగు చేసేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటివరకు రైతులు విత్తనాల కొనుగోలు, నారుమళ్ల ఆధారంగా కేవలం 6,800 ఎకరాల్లో వరి సాగు చేయవచ్చని మండల వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

సన్నరకాల వైపు మొగ్గు..

ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాలు ఏవైనా ఆరబెట్టుకుని తీసుకవచ్చిన వడ్లకు క్వింటాల్‌కు రూ.2,203 చెల్లిస్తుంది. ఈ సంవత్సరం ఆది నుంచి సన్నరకాలకు డిమాండ్ పెరగడంతో ప్రైవేట్ వ్యాపారులు గ్రామాలకు వచ్చి గిట్టుబాటు ధర రూ.3 వేలు చెల్లించడంతో రైతులు యాసంగి పంటగా బోరుబావుల కింద ఎక్కువగా ఆర్ఎన్ఆర్, కేఎన్ఎం 1638 రకాలు సాగు చేస్తున్నారు. దొడ్డు రకాల్లో జేజీఎల్ 24423, కేఎన్ఎం 118 రకాలు సాగు చేస్తున్నారు.

మెళకువలు పాటించాలి



మండలంలో కేఎల్ఐ నీటిని నిలిపివేయడంతో బోరుబావుల్లో నీళ్లు ఉన్న రైతులు వరి పంటను సాగు చేసుకుంటున్నారు. రైతులు విత్తనాల దగ్గర నుంచి వరినాట్లు, కలుపుమందులు, ఎరువులు, తెగుళ్ల నివారణ ఇలా ప్రతి విషయంలో మెళకువలు పాటించినప్పుడే మంచి దిగుబడి వస్తుంది.

– మల్లయ్య, ఏఓ, ఖిల్లాఘనపురం

దేశాయి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

అమరచింత: మాజీ అడ్వకేట్ జనరల్ హైకోర్టు న్యాయవాది దేశాయి ప్రకాష్ రెడ్డి జన్మదిన వేడుకలను పట్టణంలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మంగమ్మ, టీపీసీసీ నాయకుడు నాగరాజ్ గౌడ్ కేక్ కట్ చేశారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు, నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రాజు, సీఐ రత్నం, అయ్యుబ్‌ఖాన్, నరసింహులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: దేశాయి ప్రకాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సయ్యద్‌కలాంపాష, శ్రీనివాసులు, సర్దార్ బేగ్, రాములు, విజయ్, చిన్నకుర్మన్న ఉన్నారు.

నేటి నుంచి పాంరెడ్డిపల్లె ఉర్సు



ముస్తాబవుతున్న మహబూబ్ ఉస్సేని దర్గా

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లెలో వెలసిన హజరత్ మహబూబ్ హుస్సేని దర్గా ఉర్సు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు నిర్వాహకులు మహిమూద్, ఖాజా తెలిపారు. ఆదివారం గంధోత్సవం, సోమవారం ఉర్సు, మంగళవారం జియారతే పాతెహా ఉంటాయన్నారు. ప్రతి సంవత్సరం గ్రామంలో ఉర్సు క్రమం తప్పకుండా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. ఉత్సవాలకు పట్టణ ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు ప్రతి ఒక్కరు పాల్గొని కందూర్లతో నైవేద్యాలను సమర్పిస్తారని తెలిపారు.

కరాటే గ్రేడింగ్ పరీక్షలు



చేతులతో పెంకులు పగులగొడుతున్న కేజీబీవీ విద్యార్థినులు

గోపాల్‌పేట: మండల కేంద్రంలో విక్టరీ షాటోకాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ పాఠశాల, గర్ల్స్, బాయ్స్ పాఠశాలలు, ఏదుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులు గ్రేడింగ్ టెస్టులో పాల్గొని కర్రసాము, నాన్‌చాక్, కరాటే, స్పారింగ్, లెగ్ బ్యాలెన్స్ సాహసాలు చేసి 130 మంది గ్రేడింగ్ టెస్టు పాసయ్యారు.

ఎమ్మెల్యేకు సన్మానం

కొత్తకోట రూరల్: దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని, నిరంతరం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. భీమా చంద్రకాంత్, రాజు, శంకర్‌శెట్టి తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

పరమేశ్వరస్వామి చెరువు ఖాళీ

- అడుగంటనున్న భూగర్భ జలాలు
- వేసవిలో నెలకొననున్న తాగునీటి ఎద్దడి



చెరువు తూము

ఆత్మకూర్: అసలే వర్షాలు కురువక అంతంత మాత్రమే పరమేశ్వరస్వామి చెరువులో నీరు చేరింది. పక్షం రోజులుగా చెప్పా పెట్టకుండా చెరువులోని నీటిని వృథాగా కిందికి వదులుతుండడంతో మరో 15 రోజుల్లో చెరువు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. మున్సిపాలిటీ కేంద్రంలో పది వార్డుల్లో సుమారు 20వేలకుపైగా ప్రజలు నివసిస్తున్నారు. 5వేలకుపైగా నివాస గృహాలు ఉండగా, దాదాపు వెయ్యికిపైగా నివాసాల్లో బోర్లు ఉన్నాయి. ఆ బోర్ల సాయంతోనే నీటి అవసరాలను పట్టణ ప్రజలు తీర్చుకుంటున్నారు.

పంటల పేరిట నీటి తరలింపు

పరమేశ్వరస్వామి చెరువు కింద పంటలు పండించేందుకు సాగు నీటిని వదులు తున్నామని అంటున్నారు. ఈ వర్షాకాలంలో వర్షాలు ఆశించిన మేర కురువలేదని, రానున్న వేసవికాలం మార్చి, ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి కష్టాలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయంటూ జూరాల అధికారులు క్రాప్‌హాలిడే ప్రకటించిన విషయాన్ని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పరమేశ్వరస్వామి చెరువులోని నీటిని వదలడంతో భూగర్భ జలాలు పూర్తిగా ఇంకిపోయి బోర్లలో నీరు రాకుంటే వచ్చే వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవని స్థానికులు అంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెరువునీటి విడుదలను నిలిపివేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.



చెరువు నుంచి కిందికి వెళ్తున్న నీరు



చెరువులో తగ్గిన నీటిమట్టం